ప్రజాశక్తి
శనివారం 9 సెప్టెంబర్ 2023 | 5 | అనంతపురం

అర్జీలను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

పూర్తిస్థాయిలో అర్జీలకు పరిష్కారం

జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

జగనన్నకు చెబుదాం అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 56 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా వచ్చిన అర్జీలను పూర్తి నాణ్యతతో పరిష్కరించాలన్నారు. జగనన్నకు చెబుదాం అర్జీలను నాణ్యతగా పరిష్కరించేందుకు డివిజన్, మండల స్థాయిలో అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. జగనన్నకు చెబుదాం అర్జీలను వ్యక్తిగతంగా తీసుకుని అర్జీదారుడితో ప్రత్యేకంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారం చూపించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మండల స్థాయిలోనే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపిస్తే అర్జీదారులు జిల్లా స్థాయికి రావాల్సిన అవసరం ఉండదన్నారు. గ్రామ, మండల స్థాయిలో పరిష్కరించాల్సినవి అక్కడే పరిష్కరించాలని, ప్రభుత్వ నియమ నిబంధనలను పాటిస్తూ సమస్యలను పరిష్కరించాలని, ఇందుకోసం ప్రత్యేక మెకానిజం రూపొందించుకోవాలన్నారు. మండల స్థాయిలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరుకావాలన్నారు. ఎప్పటికప్పుడు ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలకు పరిష్కారం చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్డీఏ పీడీ నరసింహా రెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ ఓబుల్ రెడ్డి, స్పందన తహసీల్దార్ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

టమోటా రైతుకు..

నష్టాలే మి(ది)గులు..!

◆ మొన్న నో స్టాక్- నేడు నో సేల్ ◆ ధరలేక టమోటా రైతు విలవిల



టమోటాకు ధర లేక అనంతపురం బైపాస్ రోడ్డులోని నడిమివంకలోకి టమోటాలను పారేస్తున్న రైతు..

నార్పల వద్ద రోడ్డు పక్కన పారవేసిన టమోటాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మొన్నటి వరకు మంచి ధర ఉందని ఆనందించిన టమోటా రైతుకు మళ్లీ నిరాశే మిగులుతోంది. పంట కోతకు పెట్టిన పెట్టిబడి కూడా మిగలడం లేదు.. అరుగాలం కష్టపడి పండించిన మార్కెట్‌కు తీసుకొస్తే నో సేల్ అంటున్నారు. దీంతో చేసేది లేక టమోటా పంటను రోడ్లలోనే పడేసి వెనుదిరిగే పరిస్థితి జిల్లాలో నెలకొంది. అనంతపురం జిల్లాలో బోరుబావుల కింద టమోటా సాగు పెద్దఎత్తునే ఉంటోంది. ఈ ఏడాది ఆగస్టు వరకు మంచి ధర ఉండటంతో మరింత మంది రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అయితే ధర పడిపోవడంతో రైతుకు నష్టాలే మిగులుతున్నాయి.

గతేడాది కంటే తక్కువైనా ధర లేదు..

గతేడాదితో పోలీస్తే పంట సాగు చూసుకున్నా, మార్కెట్‌కు వస్తున్నా దిగుబడులు చూసుకున్నా చాలా తక్కువగానే ఉంది. కానీ ధర మాత్రం చాలా తక్కువగా ఉండటం గమనార్హం. గతేడాది ఈ సమయానికి అనంతపురం జిల్లాలో 60 వేల ఎకరాల్లో టమోటా పంటసాగైంది. ఈసారి కేవలం 11,500 ఎకరాల్లోనే సాగైంది. పంట సాగు తక్కువ అవడమే కాకుండా మార్కెట్‌కు వస్తున్న సరుకు చూసుకున్నా చాలా తక్కువనే చెప్పాలి. గతేడాది ఈ సమయానికి రోజుకు నాలుగు లక్షల బాక్సులు అనంతపురం రూరల్‌లోని కక్కలపల్లి మార్కెట్‌కు వస్తుండేవి. ఇప్పుడు ఈ మార్కెట్‌కు వస్తున్న టమోటా కేవలం ఒకటిన్నర లక్ష బాక్సులు మాత్రమే. ఇంత తక్కువగా పంట వస్తున్నా ధర మాత్రం ఉండటం లేదు.

పంట కోతకు రూ.5500... మార్కెట్‌లో అమ్మితే వచ్చింది రూ.5000...

ఆత్మకూరు మండలం పంపనూరు తండాకు చెందిన రామకృష్ణా నాయక్ తనకున్న ఒకటిన్నర ఎకరా పొలంలో టమోటా సాగు చేశాడు. ఇప్పుడు ఈ పంట కోతకు వచ్చింది. రెండు రోజు క్రితం రామకృష్ణా నాయక్ టమోటా పంట కోత కోసి మార్కెట్‌కు తీసుకొచ్చాడు. వస్తే పంట పెట్టుబడి ఎలాగున్నా... కనీసం పంటకోసి మార్కెట్‌కు తెచ్చిన ఖర్చు కూడా చేతికి రాలేదని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయన చెప్పిన లెక్కల ప్రకారం పంట కోయగా వచ్చిన దిగుబడి వంద బాక్సులు అయ్యాయి. బాక్సుకు 15 కిలోలు. ఈ బాక్సులకు ఒక్కో దానికి రవాణా ఖర్చు పంనూరు తండా నుంచి మార్కెట్‌కు రూ.16 చొప్పున 100 బాక్సులకు రూ.1600 ఖర్చు వచ్చింది. ఇక బాక్సు బాడుగ ఒక్కో దానికి మూడు రూపాయల చొప్పున రూ.300 బాక్సుల బాడుగ. దింపడానికి హామీలీ ధర ఒక్కో బాక్సు రూపాయి. చొప్పున వంద రూపాయలు. ఇక తోటలో కాయలు కోయడానికి ఒక్కో కూలీకి రూ.300 చొప్పున పది మందికి రూ.3000. ఇక మార్కెట్‌లో అమ్మినందుకు పది శాతం కమిషన్ కలిపి మొత్తం రూ.5500 అయ్యింది. మార్కెట్‌లో బాక్సు రూ.50 చొప్పున అమ్ముడుపోయింది. దీనికి ఆ రైతుకు వచ్చింది రూ.5000. ఇంకా చేతి నుంచి రూ.500 రైతుకు పడింది. ఆరుగాలం కష్టపడిన రైతుకు మిగిలింది రూ.500 అదనపు ఖర్చు. ఇక అది కూడా కొనకపోతే బయటపడేసే రైతుకు మొత్తం నష్టమే మిగులుతోంది.

ఉత్తరాదిలో పంట అధికంగా వచ్చింది

ఉత్తరాది రాష్ట్రాల్లో పంట దిగుబడులు అధికంగా వచ్చాయి. దీంతో ఇక్కడి నుంచి వెళ్లాల్సిన సరుకు బయటకు వెళ్లటం లేదు. దీంతో మార్కెట్‌కు ముందు కంటే తక్కువ సరుకు వచ్చినా మిగిలిపోతోంది. అక్కడ వర్షాలొస్తున్నాయి. ఆ సమయంలో పంట దెబ్బతినే పరిస్థితులున్నాయి. అక్కడ పంట తగ్గితే ఇక్కడ ధర పెరిగే అవకాశముంది. సరుకు బయటకు వెళ్లకపోవడంతోనే ధర పడిపోతోంది.

రమణ, టమోటా వ్యాపారి.

తుపాకీతో కాల్చుకుని జవాన్ మృతి

మృతుడు పెనకచెర్ల వాసి

ప్రజాశక్తి-గార్లదిన్నె

మృతుడు నారాయణస్వామి (ఫైల్ ఫొటో)

పశ్చిమబెంగాల్‌లో ఆర్మీజవాన్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి తుపాకీ కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... గార్లదిన్నె మండలం పెనకచర్ల డ్యాం గ్రామానికి చెందిన బోయ నారాయణస్వామి(30) బిఎస్‌ఎఫ్ జవాన్‌గా పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం ఈయన సైన్యంలోకి వెళ్లాడు. ఇతని తల్లిదండ్రులు ఇద్దరూ మరణించారు. ఐదేళ్ల క్రితం బందార్లపల్లికి చెందిన శ్రీవాణిని వివాహం చేసుకున్నాడు. ఇతనికి కుమార్తె శ్రీవర్ష, కుమారుడు కుసల్దేవ్‌లు ఉన్నారు. భార్యా పిల్లలు పెనకచర్లలోనే ఉండేవారు. నారాయణస్వామి విధి నిర్వహణ నిమిత్తం పశ్చిమబెంగాల్‌లో ఉంటూ సెలవు రోజుల్లో ఇంటికి వస్తూ పోతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం వేకువజామున అతను ఉన్న క్యాంపు సెంటర్లలో తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడన్న విషయం తెలియాల్సి ఉంది. కాగా జవాన్ మృతితో పెనకచెర్ల గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

బిసిల ద్రోహి చంద్రబాబు : మంత్రి

ప్రజాశక్తి-కుందుర్పి

బిసిల ద్రోహి టిడిపి అధినేత చంద్రబాబు అని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొ న్నారు. కుందుర్పిలో శుక్రవారం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు అడుగ డుగునా ఇబ్బందులు కలిగించినందుకే చంద్రబాబుకు బిసి సామాజివర్గ ద్రోహిగా ముద్ర పడిందన్నారు. కళ్యాణ దుర్గం నియోజకవర్గంలో ప్రజలను మోసం చేసి రైతులకు చిల్లి గవ్వ ఇవ్వకుండా కాలువ తవ్వి రైతు ద్రోహిగా నిచిచాడన్నారు. కమ్మ సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించి ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాలను సభా సమావేశాలకు కూడా రానివ్వకుండా ఇబ్బంది కలిగించిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపికి చెందిన సజ్జల రుద్రమ్మ, కోళ్ల తిప్పమ్మ కుమారు డు మంజునాథ కుటుంబాలు వైసిపిలోకి చేరాయి. కార్యక్రమంలో ఎంపిపి కమల నాగరాజు, జడ్పిటిసి రాధా స్వామి, కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, జెఎసి మండల కన్వీనర్ ఈ.రాము, సింగిల్‌విండో ఛైర్మన్ ఎఆర్ వన్నూరు రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ గోరంట్ల మాధవ్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై హిందూపురం ఎంపీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ తెలుగు యువత ఆధ్వర్యంలో శుక్రవారం టవర్‌క్లాక్ సర్కిల్‌లో ఎంపీ గోరంట్ల మాధవ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తెలుగు యువత నాయకులు సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ సిఎం జగన్‌ను మాజీ సిఎం చంద్రబాబు అనరాని మాట అన్నారంటూ నీతిమాలిన వాఖ్యలు చేయడం ఎంపీ మాధవ్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. నోరు అదుపులో పెట్టుకోవాలని, చంద్రబాబుని విమర్శించే స్థాయి నీది కాదని హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో గల్లంతవుతావనే భయపడి ఇలాంటి వాఖ్యలు చేస్తున్నట్లు ఉందనిన్నారు. మరోమారు నోరు పారేసుకుంటే నీఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు గోపాల్‌గౌడ్, బొమ్మినేని శివ, బాలప్ప, వడ్డే మురళి, శిరీషాల రాంబాబు, అంజి, సుంకన్న, సున్నం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ గోరంట్ల మాధవ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న తెలుగుయువత నాయకులు

ఉమ్మడి జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టాలి

కలెక్టర్లకు ప్రజా, పౌరసంఘాల నేతల విజ్ఞప్తి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా తక్షణమే సహాయక చర్యలు చేపట్టి రైతులు, ప్రజలను ఆదుకోవాలని రాయలసీమ అభివృద్ధి వేదిక, అనంత ప్రజా, పౌర సంఘాల కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం అనంత ప్రజా పౌర సంఘాల ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టర్ ఎం.గౌతమి, శ్రీసత్యసాయి కలెక్టర్ పి.అరుణ్‌బాబులకు వాట్సప్ ద్వారా విజ్ఞాపన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సమస్యలపై మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ అనంతపురం, శ్రీసత్యయసాయి జిల్లాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. గత రెండు సంవత్సరాల్లో కురిసిన అధిక వర్షాలతో మెట్ట పంటలతో పాటు, ఉద్యాన పంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం పంట భీమా పథకాల ద్వారా రైతులకు పరిహారం సకాలంలో అందించినప్పటికీ రైతులకు జరిగిన నష్టాలను పూర్తిగా పూడ్చలేకపోయారని తెలిపారు. ఈ ఖరీఫ్‌లో వర్షాలు జూలై- ఆగస్ట్ మాసాల్లో ఆలస్యంగా రావడమే కాకుండా సగటు వర్షపాతానికి 30-40 శాతం లోటుగా వర్షపాతం నమోదయిందన్నారు. పడిన వర్షపాతం కూడా ఒక్కో మండలంలో ఒక్కో విధంగా నమోదైందన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో కురుస్తున్న వర్షాలతో పశువుల మేత ఉపయోగపడుతుంది తప్పా పంటలు పండే అవకాశం ఉండదన్నారు. కరువు ఏర్పడిందని, తక్షణమే ప్రభుత్వానికి కరువు నివేదికలు పంపి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తేనే పంటలు పండించే అవకాశం ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఆర్‌డిటి ఎకాలజి తదితర స్వచ్ఛంద సంస్థలు రైతుల పంటలు ఎండిపోకుండా రక్షకతడులు ఇవ్వడానికి రైతులు పరస్పరం సహకరించుకునే విధానాన్ని ఆచరణలో చూపడంతో మిగతా రైతులు కూడా ఒకరికొకరు సహకరించుకోవడం వల్ల విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు. రైతులు అప్పులు చేసి వ్యవసాయం పంటలు సాగు చేస్తున్నారని, పంటలు దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. 2023 జనవరి నుంచి 25 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కౌలుకు ఇచ్చిన భూయజమానులు కౌలు రైతులకు సంతకాలు పెట్టడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. పంట నమోదు కార్యక్రమంలో భూయజమానులతో సంబంధం లేకుండా ఎకరైతే వాస్తవంగా పంటలు సాగు చేస్తున్నారో ఆ సీజన్‌కు వారిని కౌలు రైతులుగా గుర్తించాలని కోరారు. కరువు ఏర్పడిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలకు 90 శాతం రాయితీతో రైతులకు విత్తనాలు సరఫరా చేయాలని కోరారు. బ్యాంక్ రుణాలపై మారిటోరియం ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కరువు పరిస్థితుల కారణంగా గ్రామీణ ఉపాధి పనిదినాల సంఖ్యను పెంచాలన్నారు. గొర్రెల పెంపకం దారులకు నీటి వసతి కల్పించాలని కోరారు. అటవీ ప్రాంతాలకు దగ్గరగా బోర్లు వేసి నీటి మడుగులు ఏర్పాటు చేయాలన్నారు.

బాల్యవివాహాలను నివారిద్దాం

మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ బిఎన్.శ్రీదేవి

ప్రజాశక్తి-శింగనమల

బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ బిఎన్.శ్రీదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో డిసిపిఒ సుబ్రమణ్యం, ఛైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణమాచారి ఆధ్వర్యంలో బాల్య వివాహ నిరోధక అధికారాలు, విధులపై డివిజినల్ స్థాయి ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించడంలో ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో విఆర్‌ఒ, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. వీరందరూ గ్రామాల్లో బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనార్ధలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం బాల్యవివాహాల నిషేధ చట్టం-2006 గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసి ఛైర్‌పర్సన్ రామలక్ష్మి, సిడిపిఒ ఉమా శంకరమ్మ, శింగనమల ఎంపిడిఒ నిర్మలాకుమారి, గార్లదిన్నె ఎంపిడిఒ తేజోష్ణ, డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయ డెమోలు త్యాగరాజు గంగాధర్, ఐసిడిఎస్ సిడిపిఒలు సూపర్‌వైజర్లు, అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ బిఎన్.శ్రీదేవి

'చంద్రబాబు నోటీసులపై మాట్లాడు'

కాలవకు విప్ కాపు రామచంద్రారెడ్డి సవాల్

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజల దృష్టి మరల్చేందుకు తనపై ఆరోపణలు, ఛాలెంజ్‌లు చేయడం మాని ముందు మీ అధినేత చంద్ర బాబుకి ఆదాయ పన్ను శాఖ పంపించిన నోటీసులకు సమాధానం చెప్పాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులకు సవాల్ చేశారు. రూ. కోట్లు కొల్లగొట్టిన కేసుల్లో త్వరలో చంద్రబాబు జైలుకు వెళ్తారా లేక స్టే తెచ్చుకుంటారా? అని ప్రశ్నించారు. జయలలిత, లాలూప్రసాద్‌యాదవ్ లాగా జైలు తప్పదేమో.. తుప్పునాయుడు ఈ వయసులో జైలుకు వెళితే తిరిగొస్తారో లేదో అన్నారు. తుప్పు నాయుడు, పప్పు నాయుడు ఇద్దరూ భారీ కుంభకోణాల్లో అడ్డంగా ఇరుక్కున్నారు. ఇద్దరూ జైలు పాలైతే మీ పరిస్థితి ఏంటో ఆలోచించుకో అని హితవు పలికారు. చంద్రబాబుకు దమ్ముంటే స్టే తెచ్చుకోకుండా విచారణకు సిద్ధపడమనండి అని సవాల్ చేశారు. ఇకనైనా కాస్త ఆలోచించి మాట్లాడు లేకపోతే రాయదుర్గం ప్రజలే నీకు సరైన దారి చూపిస్తారని తెలిపారు.

పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బిసిఆర్.దాస్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వచ్చే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బిసిఆర్.దాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఎస్సీ వర్గీకరణ కోరుతూ మహాదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అథిగా హాజరైన బిసిఆర్.దాస్ మాట్లాడుతూ బిజెపి అధికారంలో రాగానే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హామీ ఇచ్చారని తెలిపారు. 9 ఏళ్ల పాలనలో వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం ఊసే ఎత్తడం లేదన్నారు. ఇప్పటికైన స్పందించి ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలన్నారు. లేని పక్ష్యంలో ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఉద్యమాలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ మహాదీక్షలో ఎమ్మార్పిఎస్ జిల్లా ఇన్‌చార్జి గుండాల ఈశ్వరయ్య, నాయకులు కదిరప్ప, రాము, ఆది పెద్దరాజు, మలరాయుడు, కుమారి, సునీత, పెద్దన్న, జానకిరామ్, జేఏసి రాష్ట్ర అధ్యక్షులు కుమార్, అంజి, పురుషోత్తం, లక్ష్మణ్, ఆటో మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. : ఎస్పీ

మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ భార్యకు పరామర్శ

ప్రజాశక్తి-ఆత్మకూరు

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అధైర్య పడొద్దని ఎల్లవేళలా పోలీస్‌శాఖ అండగా ఉంటుందని ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ భార్య అనితకు ఎస్పీ కె.శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. ఇటీవల అనంతపురం సమీపంలోని ఇస్కాన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ మృతిచెందగా భార్య అనిత తీవ్రంగా గాయపడి బెంగళూరులో చికిత్స పొందింది. ఈనేపథ్యంలో ఆమె పూర్తిగా కోలుకుని ఆత్మకూరులోని స్వగ్రామానికి చేరుకుంది. విషయం తెలుసుకున్న ఎస్పీ ఆమె వద్దకు చేరుకుని పరామర్శించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకుని కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ పెద్ద దిక్కు లేరని బాధపడకండి.. పోలీసు శాఖ ఎప్పుడూ మీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనతోపాటు ఏఆర్ డీఎస్పీ మునిరాజ్, సి.ఐ నరేంద్రరెడ్డి, ఆర్ఐ రాముడు, ఆర్ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకె త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, మసూద్‌వలి, తదితరులు ఉన్నారు.

క్షణికావేశాలకు లోనుకావొద్దు..

మానసిక వైద్యులు ఎండ్లూరి ప్రభాకర్

ప్రజాశక్తి-అనంతపురం

మాట్లాడుతున్న మానసిక వైద్యులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్

ఎవరూ క్షణికావేశాలకు లోనై తప్పుడు నిర్ణయాలు తీసుకోకూడదని మానసిక వైద్యులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ సూచించారు. అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలోని గఫూర్ కాలేజీలో డాక్టర్ కెఎస్ఎన్ గఫూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కరస్పాండెంట్ అబ్దుల్ రజాక్ గఫూర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎక్కడ చూసినా క్షణికావేశాలతో యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ముఖ్యంగా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి ఎక్కువ శాతం ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి నివారణకు మెడికల్ సైన్స్ విద్యార్థులు కృషి చేయాలన్నారు. డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్ మాట్లాడుతూ ఎన్నో సమస్యలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆత్మహత్య చేసుకునే ముందు ఒకసారి తమ పిల్లలు, కుటుంబం గురించి ఆలోచిస్తే ఇలాంటి నిర్ణయం తీసుకోరన్నారు. మెడికల్ కళాశాల [illegible] పరదేశీనాయుడు మాట్లాడుతూ ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు చిన్న చిన్న సమస్యలకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అలాంటి నిర్ణయాలను ఎవరూ తీసుకోవదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్.అర్షద్ అయాబ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

మృతిచెందిన రవి

గుత్తి : మండలంలోని తురకపల్లి రైల్వే యార్డు సమీపంలో ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, హెడ్‌కానిస్టేబుల్ వాసు తెలిపిన వివరాల మేరకు కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా అడికి తాలూకా సేదం గ్రామానికి చెందిన శివప్ప కుమారుడు రవి (26) బెంగళూరులోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. అయితే ఏ కారణం చేతనో గుత్తి రైల్వే యార్డు వద్దకు చేరుకుని రైలు కింద తల పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తాడిపత్రిలో...

మృతిచెందిన గురునాథ్

తాడిపత్రి రూరల్ : రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రూరల్ పరిధిలోని పుట్లూరు రోడ్డు సమీపంలోని రైల్వేట్రాక్‌పై శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రూరల్ పరిధిలోని గన్నవారిపల్లి కాలనీకి చెందిన గురునాథ్ (24) కొద్ది రోజుల క్రితం తన తండ్రి గురుస్వామి చనిపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈనేపథ్యంలో తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని కొజ్జేపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జ్యోతి తన తల్లి మందలించిందని మనస్థాపం చెంది పంటలకు పిచికారీ చేసే పురుగుల మందును తాగి అపస్మారకస్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం యువతిని అనంతపురం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ప్రజల వద్దకే పాలన

ఎమ్మెల్యే పద్మావతి, ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

ఉత్తమ ఉపాధ్యాయురాలు ముబీనాను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి దంపతులు

సచివాలయం, వాలంటరీ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ పాలనను తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని సోదనపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ ప్రజల గుండెల్లో స్థానాన్ని పదిలం చేసుకున్నారన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకు పథకాలు అందిస్తున్నారన్నారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న ఉపాధ్యాయురాలు ఎస్.ముబీనాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ సి.హెచ్.ప్రమీల, డిసిఎంస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, యువ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, ఎంపిడిఒ నిర్మలాకుమారి, ఎఒ అన్వేష్‌కుమార్, సర్పంచు గోపాల్‌రెడ్డి, చాగంటి సుబ్బారెడ్డి, శివశంకర్‌రెడ్డి, గురుమూర్తిరెడ్డి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, చందర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, చెవిరెడ్డి, చిన్నబయన్న, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-బెలుగుప్ప

మహిళకు కరపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి

పేదల సంక్షేమం కోసమే సిఎం జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జీడిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ముందుగా వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన మహిళలతో కలిసి సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, నాయకులు త్రిలోక్‌నాథ్‌రెడ్డి, దుద్దేకుంట రామాంజనేయులు, పి.శ్రీనివాసులు, బి.శివలింగప్ప, జి.శ్రీనివాసులు, బ్రహ్మయ్య అశోక్, రుద్రానంద, శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్, తిమ్మన్న, తహశీల్దార్ డి.ఓబులేసు, ఎంపిడిఒ రామచంద్ర, ఎఇ గంగాధర, హౌసింగ్ ఎఇ శివారెడ్డి, ఎఒ పృధ్వీసాగర్,. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ రూపురేఖలను మార్చిన సిఎం జగన్

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేశారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నాబార్డ్ నిధులు రూ.1.24 కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించారన్నారు. ముఖ్యంగా జగనన్న విద్యాకానుక ద్వారా విద్యార్థులందరికీ యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూలు, సాక్సులు, బెల్టులను ఉచితంగా అందజేశారన్నారు. జగనన్న గోరుముద్దతో నాణ్యమైన, పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు వివరించారు. పిల్లలను బడులకు పంపే కుటుంబాలకు ఆర్థికభారం కాకూడదనే ఉద్దేశంతో ఏడాదికి రూ.15వేలు అమ్మఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. ఆఖరకు కరోనా కాలంలో కూడా ప్రభుత్వం పథకాలను నిలపలేదన్నారు. ప్రపంచంతో పోటీ పడి ఐటి ఇంజినీర్లు కాదు.. ఐటీ కంపెనీలు పెట్టేస్థాయికి మన పిల్లలు ఎదగాలన్నదే సిఎం జగన ఉద్దేశమన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మతి చెందిన మండల కేంద్రానికి చెందిన వైసీపీ నాయకులు సురేష్‌రెడ్డి, ఓబుళరెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా అధైర్య పడొద్దని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, జె సి ఎస్ ఇన్చార్జులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్ లు, డైరెక్టర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, పోలింగ్ బూత్ మేనేజర్లు, సచివాలయ కన్వీనర్లు, గహ సారథులు, కన్వీనర్లు, సంబంధిత అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పెన్షన్ దారులు మరియు వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

రోడ్లు ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

నగరపాలక సంస్థ పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను ఆక్రమించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించారు. నగరంలోని ఆదిమూర్తినగర్‌లో రూ.32 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, డ్రెయినేజీలు ఆక్రమణలకు గురవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగాకుండా నిర్మాణాల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే నగరంలోని ప్రధాన రహదారుల విస్తరణ పనులు పూర్తయ్యాయని, రానున్న రెండు నెలల్లో అంతర్గత రోడ్ల(సీసీ రోడ్లు) నిర్మాణం పనులను కూడా పూర్తి చేస్తామన్నారు. రోడ్లపై ఎలాంటి కట్టడాలు కట్టకుండా అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం సలీమ్, డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, కార్పొరేటర్ అనిల్, డివిజన్ కన్వీనర్ దాదు, మున్సిపల్ ఎఇ కోమల, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నడక దారుల పనుల పరిశీలన

నగరంలో జాతీయ స్వచ్ఛమైన గాలి, కార్యక్రమం (ఎన్.క్యాప్) నిధులతో నగరంలోని మెడికల్ కళాశాల రోడ్డులో చేపట్టిన నడకదారి పనులను మేయర్ మహమ్మద్ వసీం శుక్రవారం పరిశీలించారు. పనులను త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, సైఫుల్లాబేగ్, శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ఇఇ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'దుర్గం'లో వైద్యశిబిరం

నార్పల : మండల పరిధిలోని సిద్ధరాచర్ల పంచాయతీ దుర్గం గ్రామంలో పప్పూరు ప్రాథమిక వైద్యశాల వైద్యులు రవిశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులోఉ భాగంగా ఇంటింటికీ తిరిగి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు రవిశంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లలో నీటిని ఎక్కువ కాలం నిల్వ ఉంచుకోరాదన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ఇళ్లల్లో దోమల నివారణకు వేపాకు పొగ వేసుకోవాలని, రాత్రిపూట దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రామాంజనేయులు, సూపర్‌వైజర్ శ్రీరాములు, ఎంపిహెచ్ఒ మల్లికార్జున, టిహెచ్ఎన్ విజయమ్మ, ఎఎన్ఎం ఫరీదాభాను, ఎంఎన్ఒ అమృతరాజు, ఆశాకార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ యోగానందరెడ్డి

పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి, కడవకళ్లు సచివాలయాలను ఎంపిడిఒ యోగానందరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులతోపాటు హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ బీమా, జగనన్నకు చెబుదాం, స్పందనలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అదేవిధంగా డ్రాప్‌అవుట్ పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఇంకా ఏమైనా సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యాడికి యునాని డాక్టర్‌గా అశోక్

యాడికి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతన యునాని డాక్టర్‌గా కర్నూలుకు చెందిన అశోక్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ కీళ్లు, మోకాళ్లు, తదితర నొప్పితో బాధపడే వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామని తెలిపారు.

దళితుల భూమి కబ్జాపై ఫిర్యాదు



ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న బాధిత రైతు పెద్దన్న

బుక్కరాయసముద్రం : గోవిందంపల్లిలో తన భూమిని స్థానిక వైసిపి నాయకులు కబ్జా చేశారని బాధిత రైతు పెద్దన్న అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. శుక్రవారం మండలం కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతు పెద్దన్న మాట్లాడుతూ తాను మండలంలోని బోయ కొట్టాలలో నివాసం ఉంటుండగా తనకు గోవిందంపల్లి పరిధిలోని సర్వే నెంబర్ 138లో 1.50 భూమి ఉందన్నారు. ఈ భూమిని తన తండ్రి కాలం నుంచి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే స్థానిక వైసిపి నాయకులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రికార్డులను తారుమారు చేసి భూమిని కబ్జా చేశారని వాపోయాడు. అంతేగాకుండా తన భూమిలోకి వెళ్తే కులం పేరుతో దూషిస్తున్నారని ఆదేవన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరాడు.

ఆరోగ్యంపై అవగాహన సదస్సు

అనంతపురం : స్థానిక ఎంజిబి మొబైల్స్ మహేంద్ర షోరూమ్‌లో ఉచిత షుగర్ ఫిట్నెస్ పరీక్ష, ఫిజియోథెరపీపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా బెస్ట్ కేర్ డయాగ్నోస్టిక్స్, శ్రీవేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ సంయుక్తంగా ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రోజురోజుకూ పెరుగుతున్న రుగ్మతలను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీనియర్ ఫిజియోథెరపిస్ట్ ఎ.లక్ష్మీనారాయణి వివరించారు. అనంతరం ఉచిత డయాబెటిక్ స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ కేర్ డయాగ్నస్టిక్స్ సంస్థ నిర్వాహకులు డాక్టర్ నూర్, డాక్టర్ అల్తాఫ్ మాంగే, ఎంజిబి మొబైల్స్ మహీంద్రా షోరూం సిబ్బంది లక్ష్మణ్, ఫిజియోథెరపీ క్లినిక్ సిబ్బంది, బెస్ట్ కేర్ డయాగ్నోస్టిక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ డిఇఇ ఇంతియాజ్‌కు ఉద్యోగోన్నతి

ఇఇ ఇంతియాజ్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

గుత్తి : పురపాలక సంఘంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇంతియాజ్‌కు ఉద్యోగోన్నతి లభించింది. ఆయనకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు ఒంగోలుకు బదిలీ చేశారు. దీంతో మున్సిపల్ కార్యాలయంలో అధికారులు,నాయకులు, సిబ్బంది ఇంతియాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల అధికారి ఇమామ్ హుస్సేన్, ఆర్ఐ రామాంజనేయులు, వైసిపి పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా, కౌన్సిలర్లు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

వరలక్ష్మి వ్రతం

రాయదుర్గం : చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని హటకేశ్వరస్వామి ఆలయంలో స్వకులసాలి సమాజ సత్రంలో శ్రీరాజరాజేశ్వరీ మహిళా మండలి ఆధ్వర్యంలో వరమహాలక్ష్మి వ్రతం పూజ నిర్వహించారు. ఈ సందర్భం గా అర్చకులు కరణం రమేష్‌స్వామి వరలక్ష్మి వ్రత కథ పూజా విధానాన్ని సంక్షిప్తంగా వివరించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు జరిపారు. ముత్తయిదువలకు వాయనం ఇచ్చారు. మహా మంగళహారతి అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు సునంద, అధ్యక్షురాలు విమల, ఉపాధ్యక్షురాలు చంద్రకళ, సంయుక్త కార్యదర్శి శ్రీదేవి, కోశాధికారి భారతి, స్వకుల సాలి సమాజ అధ్యక్షు లు వెంకటేశులు, రుక్మిణి, మహిళా మండలి అధ్యక్షురాలు ఈరాబాయి, చెన్నమ్మ, మహిళా మండలి ప్రతినిధులు, సమాజ బాంధవులు పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE PRINCIPAL DISTRICT JUDGE, ANANTAPURAMU
Guardian O.P.No. 58 /2023
(In the matter of permission to the petitioner to act as guardian to the minors
S.Asif & S.Mahammad Althaf)
Between:
Shaik Reshma ...petitioner
And
To whom may be served ...Respondents

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా కక్షి దారురాలైన Shaik Reshma W/o Late S.మహబూబ్ భాషా, అను ఆమే పై కోర్టులో తనకు మరియు తన పిల్లలకి రావలసిన Employees Provident Fund Amount తీసుకోవడానికి, కక్షిదారురాలైన తన భర్త EPC మహీంద్ర గ్రూప్ ఆఫ్ కంపెనీలో District-Co-Ardinator గా ఉద్యోగం చేస్తూ మరణించారు. అందువలన పై తెలిపిన కక్షిదారురాలు పై కోర్టు అర్జి వేయడమైనది. కావున ఎవరికైన ఆక్షేపణలు ఉన్నచో 27/09/2023వ తేదిన ఉదయం 10:30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ లేక వకీలు ద్వారా గాని హాజరై ఏమైనా అభ్యంతరములు తెలుపుకొనవలెను.

SCHEDULE

Employees Provident Fund Organization, bearing member ID 375170000001021 and Name is S.Mahaboob Basha having Grand Toatal (Employee Share, Employer Share and Pension Contribution) (Rs.1,66,380/-+60,603/-+ 62,946/-) Rs. 2,89,929/- (Rupees Two lakhs Eighty Nine thousands Nine hundred and Twenty Nine Only) Office situated at Kadapa.

(By order of the court)
K.HUSSAIN NIZAMI,
Advocate, Anantapuramu, Cell:9908935964

పత్తిపంట పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలు

మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామంలో సాగు చేసిన పత్తిపంటలను రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త పి.రాధిక, స్థానిక మండల వ్యవసాయ అధికారి సి.చెన్నవీరస్వామితో కలిసి శుక్రవారం పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి పంట కాయ దశలో ఉందన్నారు. అయితే పంటకు గులాబీ రంగు, కాయ తొలుచు పురుగు, వైరస్ తెగులు ఆశించిందన్నారు. కావున గులాబి రంగు పురుగు నివారణకు, పురుగు ఉనికిని గమనించడానికి ఎకరానికి నాలుగు నుంచి 8 లింగాకర్షక బుట్టలను అమర్చి వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. గులాబీ రంగు కాయ తొలుచు పురుగు నివారణకు తయోడి కార్బ్ మందును 1.5 గ్రామ్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే వైరస్ తెగులు తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుందని, నివారణకు అవసరాన్ని బట్టి లీటరు నీటికి 0.5 గ్రాముల మందును కలిపి పిచికారీ చేయాలి. అలాగే వయ్యారిభామ, గడ్డి చేమంతి, ఉత్తరేణి వంటి కలుపు మొక్కలను నాశనం చేయాలన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ త్వరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ కానుందన్నారు. ఈనేపథ్యంలో బీజెడ్సీ విద్యార్థులకు ల్యాబ్‌లోనే తరగతి నిర్వహిస్తున్నారని, క్లాస్ నిర్వహించడానికి ప్రత్యేక రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా కళాశాలలో ఉన్న అనేక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇందుకు ప్రిన్సిపాల్ స్పందిస్తూ కళాశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చరణ్, ప్రతాప్, సురేంద్రబాబు, కళాశాల కామర్స్ అధ్యాపకులు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

సచివాలయ అధికారిణికి వినతిపత్రం సమర్పిస్తున్న బీడీ కార్మిక సంఘం నాయకులు ఉమాగౌడ్, కార్మికులు

బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలివ్వాలి

కార్మిక సంఘం నాయకులు ఉమాగౌడ్

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణంలోని అర్హులైన బీడీ కార్మికులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని బీడీ కార్మిక సంఘం నాయకులు ఉమాగౌడ్ డిమాండ్ చేశారు. ఎపి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని 10వ సచివాలయం పరిధిలో ఉన్న పోరాట కాలనీ బీడీ కార్మికులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి బీడీ కార్మికులుగా పనిచేస్తున్నా పేదరికాన్ని జయించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీడీ కార్మికుల శ్రమను యాజమాన్యాలు దోచుకుంటున్నాయన్నారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర విధానాలతో నిత్యావసర ధరలు పెరిగి సామాన్యులు జీవించలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇంటి అద్దెలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కావున అధికారులు స్పందించి అర్హులైన బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం : జనసేన

ప్రజాశక్తి-అనంతపురం

కార్యకర్తలకు క్రియాశీలక సభ్యత్వ కిట్లను పంపిణీ చేస్తున్న జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్

పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు పూర్తిస్థాయిలో అండగా ఉంటామని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ భరోసా ఇచ్చారు. శనివారం నగరంలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో క్రియాశీలక కార్యకర్తలకు సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సభ్యులకు ఏదైనా జరిగితే ఆర్థికంగా అండగా ఉండేందుకు రూపొందించిందే క్రియాశీలక సభ్యత్వం అన్నారు. గడిచిన రెండేళ్లలో ప్రమాదానికి గురైన కార్యకర్తలకు రూ.50వేలు, ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాలకు రూ.5లక్షలు అందిస్తూ అండగా ఉన్నట్లు వివరించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యక్రమాల ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు జయరామ్‌రెడ్డి, నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు అంకే ఈశ్వరయ్య, నగర ఉపాధ్యక్షులు సదానందం, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేశులు, రొళ్ల భాస్కర్, వెంకటనారాయణ, హుస్సేన్, ధరాజ్ బాషా, కార్యదర్శులు లాల్‌స్వామి, రాజేష్ కన్నా, అంజి, వడ్డే వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

15లోపు ఈక్రాప్ బుకింగ్ పూర్తి చేయాలి

అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారి జె.శశికళ

ప్రజాశక్తి-అనంతపురం

ఈనెల 15వతేదీలోపు ఈక్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారి జె.శశికళ స్థానిక రైతు భరోసా కేంద్రం సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక కృషీ భవనంలో ఛైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి అధ్యక్షతన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఆర్‌బికె సిబ్బంది ఈపంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుని తీసుకోవాలని కోరారు. పశు వైద్యాధికారిణి డాక్టర్ శారద మాట్లాడుతూ పశువులకు బీమా డబ్బులు వారి అకౌంట్‌లో జమ అవుతాయని వివరించారు. అలాగే గడ్డి, జొన్న విత్తనాలు, చాప్ కటర్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు, అన్నిగ్రామాల రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు అలేఖ్య, మురళి, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నెలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

ఉరవకొండ : ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని విడపనకల్, ఉరవకొండ మండలాల వ్యవసాయ అధికారులు పెన్నయ్య, శుభకర్ సూచించారు. శుక్రవారం ఆయా రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలను పంపిణీ చేస్తోందని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వారి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇకపోతే ఈనెల 15వ తేదీలోపు ఈక్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని సంబంధిత అధికారులక సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ వైద్యాధికారులు నరేష్‌కుమార్, శ్రీవిద్య, మండల వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు సుంకన్న, గిరిబాబు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ ఈనెల 15 తేదీలోపు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.సోమశేఖర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ విత్తనాల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం కూడా 80శాతం సబ్సిడీతో ఉలవలు, పెసలు, అలసంద, కొర్ర విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారిణి ఓబులమ్మ, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్, కె.శాంతి, వెటర్నరీ డాక్టర్ రమేష్, ఉద్యానవన శాఖ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

గుత్తి : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గుచూపాలని వ్యవసాయ సహాయ సంచాలకులు

వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారి జె.శశికళ

ఎం.వెంకటరాముడు సూచించారు. శుక్రవారం పట్టణంలోని వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో అగ్రి అడ్వైజర్ బోర్డ్ కమిటీ ఛైర్మన్ రామా రంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం 80 శాతం రాయితీతో ఉలవ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాయితీ విత్తనాలు, ఎరువులను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్, ఎంపీఈవో మెర్సీ, సాంకేతిక సహాయ ఏవో మెహరున్నీషా తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో ప్రత్యామ్నాయ విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారులు

అవయవదానంపై విద్యార్థులకు అవగాహన

ధర్మవరం టౌన్ : అవయవ దానంపై పట్టణంలోని శ్రీసాయిడిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో అమ్మ బాడీ ఆర్గాన్ ఐ డొనేషన్ ఆర్గనైజేషన్ ప్రమోటర్స్ పౌండర్ గంజి ఈశ్వర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు అవయ దానం చేయవచ్చన్నారు. ముఖ్యంగా గుండె, నేత్ర, రక్తదానం వంటివి చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ చీప్ అడ్వైజర్ పెన్న సుబ్బరాజు, ఆప్తమలిక్ అసిస్టెంట్ సికిందర్ సాయి, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి సుంకు సుకుమార్, కళాశాల ప్రిన్సిపల్ ఫణికుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే అర్హత మాధవ్‌కు లేదు

కొత్తచెరువు : టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుని విమర్శించే అర్హత హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌కు లేదని టిడిపి స్థానిక నాయకులు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ రామకృష్ణ మాజీ సర్పంచి హరినాథ్ చౌదరి, బోయ రాజు, శివ, సుబ్బరాయుడు మాట్లాడారు. చంద్రబాబును తీవ్ర పదజాలంతో విమర్శించడం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం గోరంట్ల మాధవ్‌కు తగదన్నారు. గోరంట్ల మాధవ్ చేసిన తప్పులు అందరికీ తెలుసని ఇతరులను విమర్శించేముందు ఆయనేదో తెలుసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు సూర్యప్రకాష్, సోహెల్ పాల్గొన్నారు.

జిల్లా జూనియర్ ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

హిందూపురం : సత్యసాయి జిల్లా జూనియర్ అండర్-17 బాల, బాలికల ఫుట్‌బాల్ జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంజిఎం క్రీడా మైదానంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అనీల్ కుమార్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారుల్లో ప్రతిభ కనబరిచిన వారి నుంచి అండర్-17 బాలికల జట్టుకు 20 మంది, బాలుర జట్టుకు 20 మందిని ఎంపిక చేశామన్నారు. ఎంపికైన జట్లు త్వరలో నిర్వహించే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మహమ్మద్ సలీమ్, కోశాధికారి శేఖర్, పీడీలు లోక్ నాథ్, రామాంజినేయులు, కోచ్‌లు బాలాజీ, రాజ్ మిశ్రా, బాలాజీ, మౌనిక, చంద్ర, వెంకట్, విలియమ్స్, హర్ష, గిరి పాల్గొన్నారు.

అవినీతి నిరూపిస్తే రాజకీయ సన్యాసం

చంద్రబాబు విమర్శలపై ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి-గుంతకల్లు

తనతోపాటు తమ కుటుంబ సభ్యులు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని నిరూపిస్తే తమ కుటుంబా రాజకీయ సన్యాసం తీసుకునేందుకు సిద్ధంగా ఉందని సవాల్ విసిరారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుత్తి బహిరంగ సభలో టిడిపి అధినేత చంద్రబాబు తమ కుటుంబంపై చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. తమ కుటుంబాన్ని విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. తమ తండ్రి ఎల్లారెడ్డి భీమిరెడ్డి నుంచి అన్నలు, తాను ప్రజాబలంతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అయ్యామన్నారు. అంతేగానీ దొడ్డిదారిన కాదన్నారు. 'దోచుకుని దాచుకోవడం'లో చంద్రబాబును మించిన వారు లేరన్నారు. దమ్మూధైర్యం ఉంటే తమ అన్నదమ్ములు ఎమ్మెల్యేలుగా ఉన్న నియోజకవర్గాల్లో చంద్రబాబు నిలబడి గెలవాలని సవాల్ విసిరారు. గుత్తి ప్రసంగంలో చంద్రబాబు ప్రసంగాలన్నీ అవాస్తవమన్నారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు టిడిపిని భూస్థాపితం అవుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని, వైస్ ఛైర్‌పర్సన్ మైమున్, ఎంపిపి మాధవి, వైసిపి పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, నాయకులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : టిడిపి అధినేత చంద్రబాబు నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హెచ్చరించారు. గడప గడపకూ కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు వ్యాఖ్యలను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా కొనసాగే అర్హత లేదన్నారు. బాబు మాటలను చూస్తే ఆయన పూర్తిగా ఫ్రెస్టేషన్‌లో ఉన్నట్లుగా స్పష్టమవుతోందన్నారు. అంతేగాకుండా ఐటీ నోటీసుల్లో చంద్రబాబు అరెస్ట్ తప్పదదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలుసుకున్న ఒక మానసిక రోగిగా మారినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ఐటీ నోటీసుల వ్యవహారంలో చంద్రబాబు తప్పు చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. ఇకపోతే హంద్రీనీవాను 40 టీఎంసీల నుంచి 4 టీఎంసీలకు కుదించిన నీవా నీతులు చెప్పేది.. అని నిలదీశారు. జీడిపల్లి రిజర్వాయర్ కారణంగా ముంపునకు గురైన జీడిపల్లివాసులకు త్వరలోనే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా చంద్రబాబు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.

గుత్తి : నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని

ఉరవకొండలో విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

టిడిపి అధినేత చంద్రబాబు విమర్శించడం తగదని వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు కె.మధుసూదన్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్‌పేరా అన్నారు. శుక్రవారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని బషీరాబాగ్‌లో ధర్నా చేస్తున్న ఆందోళనకారులపై గుర్రాలతో తొక్కించి, తుపాకీ కాల్పుల్లో నలుగురిని హత్య చేసిన చంద్రబాబు ఇప్పుడు వచ్చి కల్లిబొల్లి మాటలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన మాటలను ఎవరూ నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, నాయకులు బేడల వెంకటరాముడు, సి.మల్లయ్యయాదవ్, ఎం.రంగస్వామి, ప్రవీణ్‌కుమార్ యాదవ్, గురుప్రసాద్ యాదవ్, సుభాష్‌రెడ్డి, సునీల్‌కుమార్, డిష్ అన్వర్, లాలూనాయక్, కౌన్సిలర్లు ఫారుక్, వరద, వాల్మీకి శివ, సర్పంచులు చంద్ర, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కుటుంబ సభ్యులపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు బురద జల్లడం తగదని వైసిపి నాయకులు ఖండించారు. శుక్రవారం స్థానిక రోడ్లు భవనాల అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గుత్తి, బహిరంగ సభలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు వెంకటరామిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డిపై అవినీతి, దౌర్జన్యపరలంటూ చంద్రబాబు మాట్లాడడం శోచనీయమన్నారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కుటుంబ సభ్యులు కులమతాలకు రాజకీయాలకు అతీతంగా నిత్యం పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ పేదలకు సేవ చేస్తున్నారన్నారు. అలాంటి కుటుంబంపై చంద్రబాబు వ్యాఖ్యలు బాధాకరమన్నారు. వెంటనే చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డిసిఎంఎస్ మాజీ అధ్యక్షులు జయచంద్రనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రమణయాదవ్, విడపనకల్లు మాజీ ఎంపిపి రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ విజయకుమార్, సర్పంచులు రామాంజనేయులు, తిరుపాల్‌యాదవ్, నాయకులు రామాంజినమ్మ, మైనుద్దీన్, జిలాన్, ఆకుకూర నాగరాజు, ముష్టూరు ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.